నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

బుధవారం 17 సెప్టెంబర్ 2025 - పేజీలు 8



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

గుంటూరు, మేజర్ న్యూస్ : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల తీగలకు చెట్లు తగలడంతో నిప్పురవ్వలు పడుతున్నాయి. ఇది ఎక్కడో కాదండి మన గుంటూరు నగరంలోని సాక్షాత్తు కలెక్టర్ ఆఫీస్ ముందు ఉన్న డీఎంహెచ్వో ఆఫీస్ దగ్గర. విద్యుత్ అధికారులు చెట్లు నరకపోవడంతో విద్యుత్తు తీగలకు చెట్లు తగలడంతో నిప్పు రవ్వలు పడుతున్నాయి. ఇక్కడ నివసించే స్థానికులు, వ్యాపారస్తులు విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాధుడే లేరని ప్రజలు వాపోతున్నారు. ఇక వర్షం వస్తే చెప్పాల్సిన పని లేదు. ఆ తీగల వల్ల చెట్లుకు కూడా విద్యుత్ వస్తుందని విద్యుత్ అధికారులే చెబుతుంటారు. మరి ఇదేంటి విద్యుత్ అధికారు లారా మీరే చెప్పండి వేలకు వేలు జీతాలు మాత్రం టయానికి తీసుకుంటారు పనులు మాత్రం చేయరు. ఇది మన విద్యుత్ అధికారుల పనితీరు ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ఈ చెట్లను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ అధికారుల పైనే ఉంది.

డిఎస్సీ అభ్యర్థుల ఆనందమే...

కూటమికి ఆశీర్వాదం

- గత ప్రభుత్వంలో డీఎస్సీ పేరిట దగా
- ఏడాది కాలంలోనే డీఎస్సీని విజయవంతం చేశాం
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మేజర్ న్యూస్ : గత ప్రభుత్వంలో డీఎస్సీ పేరట దగా చేస్తే కూటమి ప్రభుత్వం డీఎస్సీని విజయవంతంగా అమలు చేసిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న సందర్భంగా మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగుల కలను సాకారం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే నసీర్ ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో **మిగతా 3వ పేజీలో**

ఏర్పాట్లు పక్కాగా చేయాలి

గుంటూరు, మేజర్ న్యూస్ : డీఎస్సీ నియామక పత్రాలు అందజేస్తున్న ప్రాంగణంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఈ నెల 19వ తేదీన వెలగపూడిలో రాష్ట్ర సచివాలయం దగ్గర డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య మంత్రి పాల్గొననున్నారు. సంబంధిత ఏర్పాట్లను పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగర పాలక కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి **మిగతా 3వ పేజీలో**

విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉంటేనే

పేదలకు మేలు

- ప్రైవేటీకరణతో అణగారిన వర్గాలకు అందని విద్య - వైద్య సేవలు
- ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త పోరాటాలు
- నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు
- ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నిరసన

గుంటూరు, మేజర్ న్యూస్ : విద్య, వైద్యం రెండూ ప్రభుత్వ రంగంలో ఉంటేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మేలు జరుగుతుందని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అణగారిన వర్గాలతో పాటు అగ్రవర్ణాలకు చెందిన పేదలకు సైతం ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. పేద విద్యార్థులు డాక్టర్లు కావడం.. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందడం ఇష్టం లేకనే పెత్తందారీ పోకడల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోని పక్షంలో బడుగు బలహీనుల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం లాడ్జి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. పరిశపోగు శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ, స్వాతంత్ర్యం

వచ్చిన నాటి నుంచి మన రాష్ట్రంలో కేవలం 12 మెడికల్ కళాశాలలు మాత్రమే ప్రభుత్వ రంగంలో ఉంటే.. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఒకేసారి ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసిన ఘనత అందరికీ తెలిసిందేనని వ్యాఖ్యానించారు. వాటితో పాటు 17 బోధనాసుపత్రులు కూడా అందుబాటులోకి వస్తాయన్నది వాస్తవమని వివరించారు. వీటి వలన ఓవైపు పేద విద్యార్థులకు వైద్య విద్య, మరోవైపు పేద ప్రజలకు వైద్య సేవ లభిస్తుందన్నారు. ఇంకోవైపు **మిగతా 3వ పేజీలో**

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

పెదకాకాని మేజర్ న్యూస్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం -2025 పొందిన యవజన నగర్, పెదకాకాని గ్రామానికి చెందిన చావల ఆదినారాయణ ని యువజనగర్, లూదనగిరి, పెదకాకాని గ్రామ యువత మరియు గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ అభినందన కార్యక్రమంతో పెద్దలు మాట్లాడుతూ ఆది నారాయణ మాష్టారు ప్రస్తుతం నెక్కెల్లు గ్రామం తుళ్ళూరు మండలం ప్రాథమిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేయుచున్నారని, పాఠశాల అభివృద్ధికి, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో విశేష కృషి చేశారని అలాగే రాజ ధాని ప్రాంతంలో వలస కార్మికుల పిల్లలను బడిలో చెప్పించటం. మరియు రిసోర్సే పర్సన్ గా, మాష్టర్ అనేక కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. అనంతరం చవల ఆది నారాయణ వారి శ్రీమతి చవల శ్రీదేవి లను పట్టు వస్త్రాలతో అభినందించారు.

గొరంట్ల సొసైటీలో ఎరువులు పంపిణీ : డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు

గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :

గుంటూరు నగర శివారు గోరంట్ల సొసైటీ పరిధిలోని రైతులకు మంగళవారం డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాసం హరిబాబు ఎరువులను అందజేశారు. కేంద్ర మంత్రివర్యులు పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో స్థానిక శాసనసభ్యులు రామాంజనేయులు ఆదేశాల మేరకు సొసైటీ చైర్మన్ గంటసాల సోమశేఖర్ తో కలసి అందించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ... రైతులకు ఎరువులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు. అలాగే నానో యూరియా, నానో డీఏపీ వినియోగం గురించి వివరించడంతో పాటు, సాంప్రదాయ యూరియా, డీఏపీ అధికంగా వాడటం వలన భూమి సారవంతం తగ్గే ప్రమాదం ఉందని రైతులకు స్పష్టంగా తెలియజేశారు. కార్యక్రమంలో గొరంట్ల మాజీ సర్పంచి తెలుగుదేశం నాయకులు యర్రంశెట్టి వేణుగోపాల్, యక్కిట్ల శ్రీను, బుల్ల సుబ్బారావు, అబ్దుల్ రజాక్ తదితర కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గంగాధర్ సేవలు స్లాఘనీయం

– కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్ :

నరసాపురం పార్లమెంట్ సభ్యులు కేంద్ర భారీ పరిశ్రమలు ఉక్కు శాఖా సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మని బిజెపి రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్ రాష్ట్ర బ్రాహ్మణ వెల్ ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ అయిన సందర్భంగా వారిని భీమవరంలోని క్యాంపు కార్యాలయము నందు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ధన్యవాదములు తెలియ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం అనేక సంవత్సరాలుగా కృషి చేసిన వెలగలేటి గంగాధర్ కి శుభాకాంక్షలు చెప్పి బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా పేద బ్రాహ్మణులను గుర్తించి వారి అభ్యున్నతికి కృషి చేయవలసినదిగా సూచిస్తూ అభినందనలు తెలియచేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి బిజెపి రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ బిజెపి సీనియర్ నాయకులు ఈమని మాధవరెడ్డి, యువమోర్చా నాయకులు జంధ్యాల సాయి రాధాకృష్ణ పాల్గొన్నారు..

లలితమ్మ ఆశయ సాధనకు కృషి

– కత్తెర దంపతులు వెల్లడి
– వచ్చే ఏడాది నుండి ప్రతిభ అవార్డుల ప్రధానం

గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :

హార్వెస్ట్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ కత్తెర లలితమ్మ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నామని కత్తెర దంపతులు పేర్కొన్నారు. లలితమ్మ జయంతి సందర్భంగా మంగళవారం చేబ్రోలు మండలం గరువుపాలెం, క్వారీ సమీపంలోని హార్వెస్ట్ ఇండియా జూనియర్ కళాశాలలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా క్యాంపస్లో లలితమ్మ సమాధి వద్ద జ్ఞాపకార్థ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు నిర్వహించారు. అనంతరం క్వారీ వద్దగల హార్వెస్ట్ ఇండియా జూనియర్ కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా, హార్వెస్ట్ ఇండియా అధినేత తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ లు మాట్లాడుతూ 2026 సంవత్సరం నుండి లలితమ్మ జయంతి రోజున అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, ఉత్తమ ప్రతిభ

కనబరిచిన అధ్యాపకులకు, సిబ్బందికి, ప్రతిభ అవార్డులు ప్రధానం చేస్తామని వెల్లడించారు. ఆమె పేరున స్కాలర్షిప్లు అందజేస్తామని తెలిపారు. లలితమ్మ చేసిన సేవలు మరువరానివని, ఆమె పేద బడుగు, బలహీన వర్గాలు బాధితులు అనాధలకు ఎంతో సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఆమె బాటలో తాము నడుస్తున్నామని వెల్లడించారు. ఆమె ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. కె ఎస్ కె విద్యా సంస్థల సీఈవో డాక్టర్ డేవిడ్ యశ్వంత్, కత్తెర యాష్లీ,హార్వెస్ట్ ఇండియా మేనేజర్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు సుద్దపల్లి నాగరాజు శాఖల సిబ్బంది అభిమానులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

తెలంగాణాలో సినిమాల దూకుడు! ఆంధ్రాలో సినిమాల పాకుడు !!

– ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ 'తాజాగా వెబ్ సైట్ ఏర్పాటు
– సింగిల్ విండో ద్వార సకల అనుమతులకు గ్రీన్ సిగ్నల్
– 'మా-ఏపి' వ్యవస్థాపకులు సినీదర్శకుడు దిలీప్ రాజా

తెనాలి, మేజర్ న్యూస్ :

తెలంగాణాలో సినిమా చిత్రీకరణలకు, థియేటర్ల కోసం పొందాల్సిన అనుమతులన్నిటినీ తాజాగా సింగల్ విండో ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించగా ఆంధ్రాలో మౌనమే రాజ్యమేలుతుందని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మా-ఏపి) వ్యవస్థాపకులు, సినీదర్శకుడు దిలీప్రాజా ఆరోపించారు. గుంటూరు జిల్లా తెనాలిలోని మా-ఏపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ అక్కడ 'ఫిలింస్ ఇన్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక వెబ్ సైట్ ను ఏర్పాటు చేయడం వలన అంతర్జాతీయ సినిమా నిర్మాణాలకు సైతం కేవలం స్క్రిప్ట్ తో వస్తే ఆయా సినిమాలకు కావాల్సిన లోకేషన్ లు, వివిధ శాఖల అనుమతులు వస్తాయన్నారు. కాలయాపనలకు పైరవీలకు అవకాశం లేదన్నారు. దీనివలన తెలంగాణాలో సినిమా నిర్మాణాలు శరవేగంతో దూసుకుపోతాయన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రలో సినీపరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలను ప్రత్యేక బిల్లుగా ప్రవేశ పెట్టాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. సబ్సిడీ, స్టూడియోల నిర్మాణం, ఫిలింనగర్ ఏర్పాటు, లోకేషన్లు, తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వ విధి విధానాలను బిల్లులో స్పష్టం చేయవలసిందిగా దిలీప్ రాజా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి మనవి చేశారు. దశాబ్దకాలంగా ఇప్పటివరకు ఆంధ్రాలో ఒక్కసినిమాకి సబ్సిడిని ఎఫ్.డి.సి. ఇవ్వకుండారికార్డ్ సాధించిందని విమర్శించారు. ఎఫ్.డి.సి. లో చైర్మన్, ఎమ్డి, జనరల్ మెనేజర్ పోస్టులు ఖాళీగా ఉండటమే దీని పనితీరుకు నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు.

ఇటీవల పదవీ విరమణ చేసిన జనరల్ మేనెజర్ ను ఏం సాధించారని తిరిగి అదే పదవిలోకి తీసుకోడానికి ఫైల్స్ సిద్దం అవ్వడం చూస్తుంటే నిర్లక్షానికి నీళ్ళు వివరించారు.

కోడెలకు 6వ వర్ధంతి సందర్భంగా నివాళులు

నరసరావుపేట మేజర్ న్యూస్ : మాజీ స్పీకర్, పల్నాటి పులిగా ప్రసిద్ధి చెందిన స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆరో వర్ధంతి సందర్భంగా నరసరావుపేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఉమ్మడి కూటమి నేతలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు అశేషంగా పాల్గొన్నారు. నరసరావుపేటలోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో డాక్టర్ కోడెల చిత్రపటానికి ఎమ్మెల్యే అరవింద బాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనూ కోడెల విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో ఉన్నకోడెల విగ్రహానికి, 60అడుగుల రోడ్డులోని విగ్రహానికి, రావిపాడు రోడ్డులోని కమ్మ హాస్టల్ వద్ద విగ్రహాలకు పూలమాలలు వేసే వాళ్ళ అర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. రావిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీని వద్ద కూడా పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నియోజకవర్గంలో ఉన్న కోడెల విగ్రహాలన్నింటి వద్ద ఈ విధంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు పల్నాటి పులిగా పేరు పొంది, ప్రజల గుండెల్లో కలకాలం కొలువై ఉన్నారు. ఆయన నరసరావుపేట నియోజకవర్గం కోసం చేసిన అభివృద్ధి సేవలు, సామాజిక కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆయన ఆదర్శాలను ఆచరిస్తూ, నియోజకవర్గ ప్రజల కోసం మరింత కృషి

చేయడమే ఆయనకు నిజమైన నివాళి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కోడెల శివప్రసాదరావు సేవలను కొనియాడారు.

ఆయన రాజకీయ, వైద్య, సామాజిక రంగాల్లో చేసిన కృషి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో దోహదపడిందని పలువురు గుర్తు చేసుకున్నారు.

స్వర్గీయ కోడెల శివప్రసాదరావు వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ నివాళి కార్యక్రమాలు నియోజకవర్గ ప్రజల్లో ఆయన పట్ల ఉన్న గౌరవాన్ని, ఆదరణను మరోసారి తెలియజేశాయి.

పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి : అట్లూరి

పల్నాడు జిల్లా మేజర్ న్యూస్ : సాహితి చరిత్రలో సామాజిక రుగ్మాతలపై పోరాటం చేసిన మహాకవి, తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలను దేశవ్యాప్తంగా చాటి చెప్పిన నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా పేరును పల్నాడు జిల్లాకు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని గుర్రం జాషువా జిల్లా సాధన సమితి కన్వీనర్ అట్లూరి విజయకుమార్ అన్నారు. స్థానిక విజయ రెసిడెన్సీలో జరిగిన విలేకరుల సమావేశంలో విజయ్ కుమార్ మాట్లాడుతూ" సాహిత్య ని ఆయుధంగా చేసుకొని తెలుగు సమాజాన్ని మేలుకొలిపిన గుర్రం జాషువా పేరుని పల్నాడు జిల్లాపెట్టాలనే ఏకైక లక్ష్యంతో ఎస్సీ ఎస్టీ ఓబీసీ మైనార్టీలను కలుపుకొని గుర్రం జాషువా జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో మరో కార్యచరణకు శ్రీకారం చుట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా 19 తారీకు వినుకొండలో, 22 చిలకలూరిపేటలో, 25 మాచర్ల, గురజాల నియోజకవర్గాలలో కుల మత ప్రాంత రాజకీయాలకు అతీతంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని, అనంతరం జాషువా జయంతిని పరిష్కరించుకొని, జాషువా పుట్టిన గడ్డ చాట్రగడ్డపాడు నుంచి రాష్ట్ర రాజధాని అమరావతి వరకు పాదయాత్ర చేపడతామని, ఆయా స్థానిక ఎమ్మెల్యేలకు వినతి పత్రాలను అందజేస్తామని తెలియజేశారు. సమావేశంలో పాల్గొన్న అడ్వకేట్ వంకాయలపాటి రవి, అడ్వకేట్ మల్లెల అశోక్,పూనూరి కృష్ణకుమారి రెడ్డి, పిడతల రమాదేవి, బీసీ టౌన్ ప్రెసిడెంట్ కొల్లిపర బాలాజీ, బీసీ యూత్ టౌన్ ప్రెసిడెంట్ సుతారం విశ్వేశ్వరరావు,ఎమ్మార్పీఎస్ ఎస్ ఉమ్మడి గుంటూరుజిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య,ఐ ఎన్ డి సి ఎఫ్ జిల్లా అధ్యక్షులు తలారి నాని, పట్టణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కళ్యాణ్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరును పెట్టాలనే అంశానికి తమ పూర్తి మద్దతు తెలియజేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తామని అన్నారు.

పిపిపి విధానంలో వైద్య కళాశాలలు వద్దు : డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనరషిప్ విధానం ద్వారా ప్రైవేట్ వైద్య కళాశాలలుగా మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రముఖ వైద్యులు, ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 16 వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో పేదలకు వైద్య విద్య దూరమవ్వాల్సిందేనా? అనే అంశంపై జరిగిన చర్చా గోష్ఠికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. డాఎఆఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ స్వర్గీయ ఎన్టీ రామారావు నాడు ప్రైవేట్ రంగంలో ఉన్న సిద్ధార్థ మెడికల్ కాలేజీని ప్రభుత్వ రంగంలోకి తీసుకొస్తే, నేడు నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రంగంలో ప్రకటించిన 10 వైద్య కళాశాలలను పి పి పి పేరుతో ఆర్థిక లబ్ధి, రాజకీయ లబ్ధి కోసం అనుమాయులకు కేటాయించాలని భావించటం క్ష%శ%తవ్యం కాదన్నారు. ప్రైవేట్ యాజమాన్యంలో నడుస్తున్న మెడికల్ కళాశాలల్లో, అనుబంధంగా ఉన్న ఆసుపత్రులల్లో రిజర్వేషన్లు అమలు కావని నీట్ పరీక్షలో 16 శాతం మార్కులు పొందిన వారికి కూడా లక్షలాది రూపాయల డొనేషన్ తో ఎంబిబిఎస్ సీట్లు కేటాయిస్తూ ప్రతిభకు పాతరేస్తున్నారని తెలిపారు. 95 శాతం ప్రజలకు 50 శాతం మెడికల్ సీట్లు కేటాయిస్తే కేవలం 5 శాతం ధనికులకు మిగిలిన 50 శాతం ఎంబిబిఎస్ సీట్లు కేటాయిస్తూ ప్రతిభ గల పేద విద్యార్థులను శాశ్వతంగా వైద్య విద్యకు దూరం చేస్తున్నారన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో స్టైఫెండ్స్ ఇవ్వడం లేదని సి కేటగిరిలో 2 నుండి 3 కోట్లకు ఎంబిబిఎస్ సీట్లు అమ్ముకుంటున్నారని తెలిపారు. మాజీ శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రతి లోక్ సభకు ఒక వైద్య కళాశాల ఉండాలనే విధాన నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ కు 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుమతిస్తూ 60 శాతం నిధులను కేటాయిస్తే, నేడు చంద్రబాబు నాయుడు సరైన నిధులు లేవనే నెపంతో 10 మెడికల్ కళాశాలలను పి పి పి విధానానికి మార్చడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలోని విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమ కార్యాచరణను చేపట్టాలని, రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న 15 సంవత్సరాలలో ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాలను కూడా స్థాపించలేదని, ప్రైవేట్ పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయ విభాగ విశ్రాంత ప్రొఫెసర్ ఎన్.రంగయ్య ప్రసంగిస్తూ ప్రభుత్వాలు విద్య, వైద్య రంగంపై ఖర్చు చేయకుండా బుల్లెట్ రైళ్లు, ఐకానిక్ భవనాలు, మెట్రో ప్రాజెక్టుల పై ఖర్చు చేయటం భావ్యమా అని ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా ఉద్యమించి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకోవాలన్నారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి ఏ ఆర్ సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ గతంలో కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు నకిలీ అనుమతులతో విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న సంగతిని గుర్తు చేశారు. సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి ప్రసంగిస్తూ ప్రైవేట్ వైద్య విద్య ఖరీదుగా మారడంతో వైద్యులలో వ్యాపార ధోరణి పెరగడం ద్వారా రోగులు ఆర్థికంగా చితికిపోతూ అప్పుల పాలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్.ఆర్.సి.పి. విద్యార్థి విభాగ రాష్ట్ర అధ్యక్షులు పి. చైతన్య, ఐఏఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాజరజీ, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి యశ్వంత్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, బిసి జన మహా సభ కన్వీనర్ ఉగ్గం సాంబశివరావు తదితరులు ప్రసంగించారు. ప్రముఖ వైద్యులు ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఉద్యమ కార్యాచరణ కమిటీని త్వరలో ప్రకటిస్తామని అందులో విద్యార్థి యువజన సంఘాలు ప్రజా సంఘాలు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు మేధావులు స్వచ్ఛంద సంస్థల నేతలు ఉంటారని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రకటించారు.

విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉంటేనే పేదలకు మేలు

(మొదటి పేజీ తరువాయి)

వైద్య రంగంలో సీట్లు సైతం పెరిగి ఎక్కువ మంది వైద్యులు ప్రజలకు ఉచితంగా సేవలందించేందుకు సిద్ధంగా ఉంటారని తెలిపారు. పేద ప్రజల అవసరాలకు తగినన్ని ఆసుపత్రులు ప్రభుత్వ రంగంలో లేకనే తురకపాలెంలో జరిగిన వరుస మరణాలను నివారించుకోలేకపోవడమే కాక.. అసలా మరణాలు ఎందువలన సంభవించాయన్న కారణాన్ని కూడా నేటికీ గుర్తించలేని నిజాన్ని అందరూ గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలలు, వాటికి అనుబంధంగా బోధనాసుపత్రులు ఏర్పడితేనే తురకపాలెం వంటి గ్రామాల్లో వెలుగు చూసే మిస్టీరియస్ మరణాలు, విజయవాడ వంటి నగరాల్లో తలెత్తుతున్న డయేరియా కేసులు తగ్గించడం సాధ్యపడుతుందని ఆయన అభిప్రాయ పడ్డారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి ఆలోచనలు దీనికి పూర్తి భిన్నంగా ఉన్నాయని పరిశపోగు శ్రీనివాసరావు మండిపడ్డారు. పేద విద్యార్థులు ఇంగ్లీషు మీడియంలో విద్యను అభ్యసిస్తేనే ఓర్చుకోలేని చంద్రబాబు.. అసలు ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని ఈసడించిన చంద్రబాబు.. వైయస్ జగన్ పుణ్యమా అని వారు వైద్యులుగా మారడాన్ని, ఉచితంగా వైద్య సేవలు పొందడాన్ని సహించలేకనే ప్రైవేటీకరిస్తున్నారని ధ్వజమెత్తారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పని చేసానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు తన హయాంలో ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీని కూడా ఏర్పాటు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. పైపెచ్చు వైయస్ జగన్ ఏర్పాటు చేసిన కాలేజీలను7%బ% ప్రైవేటీకరించడానికి మీకు మనసెలా వచ్చింది చంద్రబాబు. అని సూటిగా ప్రశ్నించారు. చంద్ర బాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా వ్యవస్థలన్ని ంటినీ ప్రైవేటీకరణ గొడుగు కిందకు తెస్తుంటారని పరిశపోగు ఆరోపించారు. ప్రతి దానికీ ప్రైవేటీకరణ మంత్రం జపిస్తూ.. ఆ దిశగానే ఆలోచన చేస్తూ.. పరిపాలన కొనసాగిస్తారని విమర్శించారు. అందులో భాగంగానే విద్యా వైద్యంతో పాటు పారిశ్రామిక రంగాన్ని సైతం ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 32మంది ప్రాణ త్యాగంతో ఆంధ్రుల హక్కుగా దక్కించుకున్న విశాఖ ఉక్కును కూడా ప్రైవేటీకరిస్తుండడమే అందుకు ఉదాహరణగా ఆయన వివరించారు. ఈ ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ఆయన స్పష్టం చేశారు. వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. లేని పక్షంలో మిగిలిన దళిత, గిరిజన, బీసీ, ప్రజా సంఘాలను కూడా కలుపుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉవ్వెత్తున ఉద్యమిస్తామని పరిశపోగు శ్రీనివాసరావు హెచ్చరిం చారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ భరత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంగయ్య, గురవయ్య, రాష్ట్ర యువసేన అధ్యక్షుడు ఆకాశ్, జిల్లా అధ్యక్షుడు సుంకర నాని, నగర అధ్యక్షుడు దర్శనపు బాబు, జిల్లా యువసేన అధ్యక్షుడు దూపాటి ఏసుబాబు, నగర యువసేన అధ్యక్షుడు ముప్పవరపు ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కంటి, నాగరాజు, రాజు, భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో 19న "చలో మెడికల్ కాలేజీ"

గుంటూరు మేజర్ న్యూస్ : తమ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 10 కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈనెల 19న 'చలో మెడికల్ కాలేజీ' చేపడుతున్నట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పార్టీ వెల్లడించింది. ఆ రోజున ఆయా కాలేజీల వద్దకు వెళ్లే పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు అన్ని వాస్తవాలను ప్రజలకు వివరిస్తారని పార్టీ తెలియజేసింది. శాంతియుతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారని పార్టీ తెలిపింది.ఈ మేరకు వైయస్సార్సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఒక ప్రకటన చేస్తూ,పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున "చలో మెడికల్ కాలేజీ" కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఏర్పాట్లు పక్కాగా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

లతో కలిసి జిల్లా కలెక్టర్ మంగళ వారం పరిశీలించారు. ప్రధాన వేదిక, పార్కింగ్ తదితర ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎల్.ఇ.డి లను, బారికడ్లను ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు ఎక్కడా తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లాల నుండి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తగు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, జిల్లా విద్యా శాఖ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ఆనందమే కూటమికి ఆశీర్వాదం

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమలను ఆంధ్రప్రదేశ్ నుంచి తరిమికొట్టి నిరుద్యోగుల జీవితాలతో జగన్ చెలగాటమాడారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఏడాది కాలంలోనే రాష్ట్రానికి పరిశ్రమల వెల్లువ తీసుకొస్తున్నారని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా సీఎం చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని ఈ సందర్భంగా వెల్లడించారు. నూతనంగా ఎంపికైన డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ఆనందమే కూటమి ప్రభుత్వానికి ఆశీర్వాదమని తెలిపారు. ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి నారో లోకేష్ ప్రకటించడంతో రాష్ట్రంలో యువత తమ జీవితాల్లో వెలుగులు వస్తాయని నమ్మకంగా ఉందని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం లోనూ జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తున్నామని వెల్లడించారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి కుటుంబంపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

గుంటూరు, మేజర్ న్యూస్ : గుంటూరు నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అహర్నిశలు కృషి చేస్తున్నారని టీడీపీ కార్పొరేటర్లు పేర్కొన్నారు. అయితే, ఇటీవల కొంతమంది వ్యక్తులు ఎమ్మెల్యే భర్త గళ్ళా రామచంద్రరావుపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని వారు తీవ్రంగా ఖండించారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాం ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, ఈరంటి వరప్రసాద్, మానుకోండ శివ ప్రసాద్ మాట్లాడుతూ.... "ప్రజల మన్ననలు పొందిన భ్రమరా టౌన్షిప్ సంస్థపై కబ్జా ఆరోపణలు చేయడం పూర్తిగా నిరాధారం. డాక్టర్ రాఘవశర్మకు చెందిన 6 కోట్ల రూపాయల భూమిని గళ్ళా రామచంద్రరావు కబ్జా చేశారన్న కథనాలు అవాస్తవం. వాస్తవానికి ఆ భూమి 1991 నుంచి 2021 మధ్య పలు దఫాలుగా కొనుగోలు, విక్రయాలు జరిగి, రియల్ ఎస్టేట్ వ్యాపార నిమిత్తం గళ్ళా రామచంద్రరావు గారు, గళ్ళా మాధవి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడానికి ముందే, ముగ్గురుతో కలసి పున్నారావు అనే వ్యక్తి వద్ద నుండి చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. ఆ భూమికి సంబంధించి డాక్టర్ రాఘవశర్మ పేరుతో ఎలాంటి డాక్యుమెంట్లు లేవు" అని స్పష్టం చేశారు. అదే సమయంలో వారు హెచ్చరిస్తూ, "ఎవరికైనా ఆధారాలు ఉంటే సంబంధిత అధికారుల ముందు రుజువు చేయాలి. కానీ ఆధారాలు లేకుండా పుకార్లు పుట్టించడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం మాత్రమే. ఇప్పటి వరకు డాక్టర్ రాఘవశర్మ ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. అయినప్పటికీ ఒక మీడియా సంస్థ నిజ నిర్ధారణ చేయకుండానే తప్పుడు వార్తలు ప్రసారం చేయడం బాధాకరం" అన్నారు. కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్ మాట్లాడుతూ, "గతంలో కూడా నాపై ఇలాంటి నిరాధార ఆరోపణలు చేశారు. వాటిని ఆధారాలతో తిప్పికొట్టాను. ఇప్పుడు అదే తరహాలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారిపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే జరుగుతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓజోన్ పొరను రక్షించుకోవాలి

ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ : భూగోళానికి సహజ రక్షణ కవచంగా ఉంటున్న ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరి పైన ఉందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఈరోజు పెదనందిపాడు శాఖ గ్రంథాలయం ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న గేరా మోహనరావు మాట్లాడుతూ సూర్యుని నుండి వెలువడే అతినీలలోహిత కిరణాల నుండి మనకు రక్షణ కలుగజేస్తున్న ఓజోన్ పొరకే మన చర్యల వల్ల రక్షణ కరువైందని దీనివల్ల ప్రజలకు కలిగే అనర్థాలను తెలియజేసి ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలందరికీ సాటి చెప్పేందుకే ప్రతి ఏటా సెప్టెంబర్ 16వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఓజోన్ పొరకు చిల్లులు పడి భూమిపైన సమస్త జీవరాసులు ప్రమాద బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఓజోన్ పొరను పరిరక్షించుటకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా

పెంచాలని, ఇంధనాల వాడకాన్ని తగ్గించాలని, విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండి అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు డి శివ నాగేశ్వరరావు, వార్డు సభ్యుడు వెలినేని శివయ్య, కొలగాని వీరయ్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం విజయవంతం చేయండి

తెనాలి, మేజర్ న్యూస్ : స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెనాలి ఉప వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ కోరారు. తెనాలిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను ఆమె వెల్లడించారు. ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంత కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించును) అను కార్యక్రమంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు రెండు వారాల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య

ఉద్దేశ్యం అని అన్నారు. మహిళ ఆరోగ్యం పై అవగాహన పెంచడం, సమయానుకూల వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. పోషకాహారాన్ని ప్రోత్సహించడం కుటుంబాలను స్వశక్తి చేయడం లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసిందని తెలిపారు. తెనాలి నియోజకవర్గం లోని గ్రామీణ మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులు మరియు పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. తెనాలి డివిజన్ వ్యాప్తంగా జరిగే ఈ వైద్య శిబిరాలను ప్రజలందరు ఉపయోగించుకోవలసినదిగా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ కోరారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబు దారితనంగా ఉండాలి

– నియోజకవర్గంలో సుమారు లక్ష స్మార్ట్ కార్డు పంపిణీ
– ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి
– గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మాచవరం, మేజర్ న్యూస్ :
అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబు దారితనంగా ఉండాలని గురజాల నియోజకవర్గం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, మాచవరం మండలం, మాచవరం గ్రామంలోని మునుసుబు కళ్యాణ మండపం నందు మాచవరం మండలంలోని మండల స్థాయి ప్రభుత్వ అధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు , ఆర్డీవో మురళీకృష్ణ , పాల్గొనటం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు లక్ష రేషన్ కార్డు స్థానంలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో 2000 ఎకరాలు ఆన్లైన్లో ఎక్కించుకొని , కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సర్వ్ చేస్తే 1600 ఎ కారాలు తేలిందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం రేషన్ కార్డుల స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ రైస్ కార్డులను గురజాల నియోజకవర్గంలోని మాచవరం, పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాలలోని రేషన్ కార్డుదారులకు గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు , ఆర్డీవో మురళీకృష్ణ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల స్పసల్ ఆఫీసర్ శ్రీకృష్ణ దేవరాయులు,మాచవరం మండల తహసిల్దార్, నా గమల్లేశ్వరరావు, టిడిపి మండల కన్వీనర్ బడి గుంచల వెంకటేశ్వర్లు, పిడుగురాళ్ల తహసిల్దార్, దాచేపల్లి తాసిల్దార్, ఎంపీడీవోలు పాల్గొనడం జరిగింది.

గ్రామాల్లో ఆదాయం పెంపుకు నూతన మార్గాలను అన్వేషించండి

గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :
గ్రామాల్లో ఆదాయం పెంపుకు నూతన మార్గాలను అన్వేషించాలని మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు, డివ్యూటీ ఎంపీడీ వరకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాలకు వచ్చే పన్నుతో పాటు ఇతర ఆదాయం మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని సూచించారు. వీటిపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ వేమూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగరాజులు ఎంపీడీవోలకు డిప్యూటీ ఎంపీడీవో లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా మాజీ డీజీపీ ప్రసాదరావు జయంతి వేడుకలు

తెనాలి, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని తేల్లప్రోలు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ చివర డీజీపీ గా పని చేసిన డాక్టర్ బయ్యారపు ప్రసాదరావు జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. యాక్ట్ (అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్) ఆధ్వర్యంలో లో జరిగిన సభకు యాక్ట్ వైర్మన్ ఆళ్ళమూడి ప్రభాకరరావు అధ్యక్షతవహించారు. ఆయన మాట్లాడుతూ ప్రసాదరావు తేల్లప్రోలు గ్రామంలో జన్మించి ఐపిఎస్ అధికారిగా పనిచేస్తూ డీజీపీగా ఎదిగారని తెలిపారు. ఆయన జన్మించిన గ్రామంలో ఆయన 69వ జయంతి జరుపుట చాలా సంతోషమన్నారు. తెనాలి కోర్టు సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్ ప్రసాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సునీల్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రసాదరావు ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొంది గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రీడల పై దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులకు స్వీట్స్, నోట్ బుక్స్, పెన్స్,

పెన్సిల్స్, సర్ఫ్యూర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు షేక్ రుక్సానా, ఉపాధ్యాయులు శైలజ, గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మావతి, సచివాలయం సిబ్బంది భార్గవి, కనపర్తి అనూష, మాజీ ఎంపీటీసీ వేజెండ్ల ఇశ్రాయేలు, అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గాదెలవర్తి ప్రభాకరరావు, వేజెండ్ల రత్నం, అత్తోట చిట్టిబాబు పాల్గొన్నారు.

రోడ్ల పై చెత్త వేసే వారిపై అపరాధ రుసుం విధించండి

– అధికారులకు కమిషనర్ ఆదేశాలు

గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ : గుంటూరు నగరంలో చెత్తను రోడ్ల మీద, కాల్వల పక్కన, ఖాళీ స్థలాల్లో డంప్ చేయవద్దని, అలా వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ నగరంపాలెం, పాత గుంటూరు, కొత్తపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులు తప్పనిసరిగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం చేసేలా వార్డుల వారీగా శానిటేషన్ కార్యదర్శులు మరింత శ్రద్ధతో పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటికీ నగరంలో పలు ప్రాంతాల్లో చెత్త డంపింగ్ పాయింట్స్ కనిపిస్తున్నాయని, ఆయా ప్రాంతాల్లో చెత్త పడకుండా సేకరణ చేయడం, నిర్లక్ష్యంగా రోడ్ల పై చెత్త వేసే వారిపై అపరాధ రుసుం విధించడం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాల వలన

ప్రధాన రోడ్ల మీదకు మట్టి, ఇసుక వచ్చిన ప్రాంతాలను శుభ్రం చేయాలని, ప్రధాన రోడ్ల మీద పని చేసే కార్మికులు తప్పనిసరిగా రేడియం జాకెట్స్ ధరించాలన్నారు. వర్షాలకు ఎక్కడైనా చెట్లు పడి ఉంటె వాటిని తొలగించడానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఏడిహెచ్ ని ఆదేశించారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విప్పర్ల గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

– ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే

నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ : రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని, క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రొంపిచర్ల మండలంలో మొత్తం 19,680 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు పౌరసరఫరాల వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవం

తంగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్డుల ద్వారా లబ్ధిదారులు సులభంగా రేషన్ సరుకులను పొందవచ్చని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సంబంధిత శాఖల అధికారుల సమన్వయం ప్రశంసనీయమని ఎమ్మెల్యే అభినందించారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ద్వారా మండలంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం స్థానికంగా పౌరసరఫరా వ్యవస్థలో ఆధునికీకరణకు ఒక ముందడుగుగా నిలిచింది.

జీవన ఎరువుల వినియోగంపై రైతులు దృష్టిసారించండి

తెనాలి, మేజర్ న్యూస్ : రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి జీవన ఎరువుల వినియోగానికి మక్కువ చూడాలని ఏడిఏ లు సునీత, విజయబాబు సూచించారు. జీవన ఎరువులు పై మండలంలోని హాఫ్ పేటలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ కమిటి గుంటూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎ డి ఎ (డిఆర్సీ) సునీత, తెనాలి ఇన్చార్జి ఎ డి ఎ విజయబాబు లు రైతులకు జీవన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. జీవన ఎరువులు (లేదా బయోఫెర్టిలైజర్లు) అనేవి నేల సారాన్ని పెంచే, మొక్కలకు పోషకాలను అందించే సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, నీలి-ఆకుపచ్చ శైవలాలు, శిలీంధ్రాలు మొదలైనవి కలిగి ఉన్న పదార్థాలు అన్నారు. ఇవి వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరించి, కరగని ఫాస్ఫేట్లను కరిగించి, మొక్కలకు పోషకాలను అందించి, పంటల పెరుగుదలను ప్రోత్సహిస్తాయని చెప్పారు. వ్యవసాయంలో జీవన ఎరువుల వాడకం ద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గి, భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందని స్పష్టం చేశారు. జీవన ఎరువులు పనిచేయు విధానాన్ని వివరించారు. గాలిలోని నత్రజనిని మొక్కలు గ్రహించలేని రూపం నుండి మొక్కలు ఉపయోగించుకునే రూపంలోకి మార్చి, పప్పుదినుసుల వంటి మొక్కల వేర్లలోని గడ్డలలో నిల్వ చేస్తాయని తెలిపారు. నేలలోని కరగని ఫాస్ఫేట్లను కరిగించి, మొక్కలకు అందుబాటులో ఉండే రూపంలోకి మారుస్తాయని చెప్పారు. మొక్కల పెరుగుదలను ప్రోత్సహించే హార్మోన్లు, విటమిన్లు, ఎంజైములను ఉత్పత్తి చేస్తాయని చెప్పారు. రసాయన యూరియా వినియోగాన్ని తగ్గించవచ్చునని సూచించారు. తక్కువ ఖర్చుతో కూడుకున్నవిగా పేర్కొన్నారు. నేల సహజత్వాన్ని దెబ్బతీయకుండా భూసారాన్ని పెంచడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించవని స్పష్టం చేసారు. కార్యక్రమంలో తెనాలి మండల ఏవో సుధీర్ బాబు, రైతులు పాల్గొన్నారు.

పాత మల్లయపాలెం అధ్యక్షులు కుర్రి సుబ్బారెడ్డి

ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ :

పాతమాల్లయపాలెం సోసైటీ అధ్యక్షులుగా కుర్రి సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం మధ్యాహ్నం సొసైటీ సీ ఈ వో శ్రీనివాసరెడ్డి సోసైటీ అధ్యక్షులు గా కుర్రి సుబ్బారెడ్డి , డైరెక్టర్లుగా నల్లిబోయిన అశ్విని, మిట్టనోల సంగీతమ్మ ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందేవిధంగా కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు గింజుపల్లి శివరామ ప్రసాద్, గింజుపల్లి వెంకటేశ్వరావు, కాసు పెంటారెడ్డి, వెలివెల్లి సుబ్బారావు, దక్కుమళ్ళ భాగ్యరావు, చెంచులక్ష్మి, జగన్మోహనరావు, లక్ష్మారెడ్డి, కె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, గ్రామస్తులు, సోసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దసరా వాల్ పోస్టరు, ఆహ్వాన శుభపత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పెదకాకాని మేజర్ న్యూస్ : పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానము నందు 22.09.2025 సోమవారము నుండి ది.02.10.2025 గురువారము వరకు జరుగు దసరా నవరాత్రి మహోత్సవములను పురస్కరించుకొని మంగళవారము ఉదయం పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కార్యాలయము నందు శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవముల వాల్ పోస్టర్స్ మరియు బుక్‌లెట్స్‌ను ఆలయ ఉపకమీషనరు వారితో కలిసి ఆవిష్కరించినారు. ఈ కార్యక్రమములో ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ఉప ప్రధాన అర్చక పేటేటి ధనమహేశ్వరప్రసాదు, కార్యాలయ సిబ్బంది, పెదకాకాని మండల పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, పెండ్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు. దేవస్థానమునకు విచ్చేయు భక్తులకు ఎటువంటి అసౌర్యము కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని శాసనసభ్యులు శ్రీ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆలయ అధికారులకు సూచించినారు.

శరన్నవరాత్రులలో శ్రీ భ్రమరాంబ అమ్మ వారిని ప్రత్యేక అలంకారములెన శ్రీ బాలా త్రిపురసుందరిదేవి, శ్రీ గాయత్రీదేవి, శ్రీ అన్నపూర్ణదేవి, శ్రీ కాత్యాయనిదేవి, శ్రీ మహాలక్ష్మిదేవి, శ్రీ లలితాత్రిపురసుందరీదేవి, శ్రీ కదంబ వనవాసినిదేవి, శ్రీ సరస్వతీదేవి, శ్రీ దుర్గాదేవి, శ్రీ మహిషాసురమర్ధినిదేవి, శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారములలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారని ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ భక్తులకు విజ్ఞప్తి చేసినారు. శరన్నవరాత్రులలో దేవస్థాన యాగశాల నందురుద్రహోమం, చండీ హోమములు జరుగునని దేవస్థానము వారి టిక్కెట్ రూ. 1500/-లు చెల్లించి ప్రత్యక్షముగా హోమములో భక్తులు పాల్గొను అవకాశము కలదని తెలిపారు. ఉభయదాతల పూజలు ఉదయం గం.9.00 గంటల నుండి ప్రారంభించబడునని తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగముగా ఆలయమునకు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ, దేవస్థానము, యాగశాలకు ప్రత్యేక పూల అలంకరణ, దేవస్థాన ఆర్చిగేటు నందు అమ్మవారి అలంకారములో ప్రత్యేక విద్యుత్ కటౌట్ ఏర్పాటు, అన్నప్రసాద భవనము నందు భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ, ఉచిత ప్రసాదము పంపిణీ, ప్రతి నిత్యము సాంస్కృతిక కార్యక్రమములో భాగముగా సాయంత్రం గం.5.30 నుండి భజన కాలక్షేపము, కూచిపూడి నృత్యం శ్రీ కృష్ణరాయభారం నాటకం నుండి పడకసీను, మోహినీ భస్మాసుర నాటకం నుండి సీను తదితర పౌరాణిక నాటకములు జరుగునని తెలిపారు. శరన్నవరాత్రులలో శ్రీ భ్రమరాంబదేవి అమ్మవారు ప్రత్యేక అలంకారములతో భక్తులకు అనుగ్రహిస్తారని, ది.02.10.2025 గురువారము ఉదయం గం. 10.30 నిఎలకు పూర్ణాహుతి, సాయంత్రం గం. 4.30 లకు శమీపూజ జరిగిన అనంతరము శ్రీ స్వామి వారి అమ్మవార్ల గ్రామోత్సవము అత్యంత వైభవోపేతముగా మేళతాళములతో జరుగునని, తెలియజేశారు.

వన్ ఎంటర్ప్రైజెస్ నూతన వ్యాపార ప్రారంభోత్సవం

– ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే

నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :

రావిపాడు గ్రామంలో వన్ ఎంటర్ప్రైజెస్ నూతన వ్యాపార ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాపారం గ్రామ స్థాయిలో ఉపాధి అవకాశాలను పెంచుతుందని, స్థానిక వ్యాపారులకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య కూడా పాల్గొన్నారు. వారు వ్యాపార ప్రారంభాన్ని అభినందిస్తూ, ఇలాంటి చిన్న వ్యాపారాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని అన్నారు. వన్ ఎంటర్ప్రైజెస్ నిర్వాహకులు ఈ సందర్భంగా స్థానికులకు కొత్త అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ ప్రారంభోత్సవం గ్రామంలోని పలు మంది స్థానికులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకుల పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రావిపాడు గ్రామం ఆర్థికంగా మరింత పురోగమిస్తుందని ఆశిస్తున్నారు.

ఎమ్.ఏ.ఎమ్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :

నరసరావుపేట ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరంలో ప్రజలకు బీపీ, షుగర్, సాధారణ ఆరోగ్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేయడం జరిగింది. స్థానిక ప్రజలు విస్తృతంగా పాల్గొని లాభం పొందారు ఈ కార్యక్రమాన్ని ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్లు డా. ఎస్. రజిని, నాగలక్ష్మి సమన్వయం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. ప్రసాదరావు మరియు ఛైర్మన్ శేషగిరిరావు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్ల సమాజ సేవా కార్యక్రమాలను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు.

బైకులను దొంగిలిస్తున్న దొంగల ముఠాను అరెస్టు చేసిన పోలీసులు

ఈపూరు మేజర్ న్యూస్ :

ఈపూరు మండలంలోని పలు ప్రాంతాల్లో 15 ద్విచక్ర వాహనలా దొంగలు అరెస్ట్ వినుకొండ ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ళ రోడ్డులో గోపువారిపాలెం గ్రామం సమీపంలో చెడు వ్యసనాలకు బానిసలై, తేలికగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో మోటార్ సైకిల్ లను దొంగతనాలు చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట ఇన్చార్జి డిఎస్పి ఎం.హనుమంతరావు గారు తెలిపారు.

రూరల్ సీఐ ప్రభాకర్ గారు, ఈపూరు ఎస్ఐ ఉమామహేశ్వరరావు గారు లకు రాబడిన సమాచారం మేరకు ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న నలుగురు ముద్దాయిలను ముప్పాళ్ళ రోడ్డు లోని గోపువారిపాలెం జంక్షన్ సమీపంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. 6 బుల్లెట్ మోటార్ సైకిళ్ళు, 3 యునికాన్, 5 స్కూటీలను, 1 షైన్ మోటార్ సైకిల్స్ రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు 18 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. షేక్ అష్రఫ్ అనే వ్యక్తి మిగతా ముగ్గురు వ్యక్తులను ఒక టీం గా చేసుకొని దొంగతనాలకు పాల్పడేవారు అని తెలిపారు.

కళా ఉత్సవ్ జిల్లా పోటీల్లో వినుకొండ జడ్పీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు మేజర్ న్యూస్ :

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జిల్లా విద్యా శిక్షణా సంస్థ బోయపాలెంలో నిర్వహించిన కళా ఉత్సవ్ – 2025 పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. నాటకం విభాగంలో గిడుగు ఏకపాత్రాభినయం ప్రదర్శించిన పదో తరగతి విద్యార్థి ఇవివి శ్రీలక్ష్మికి ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో మూడవ బహుమతి లభించింది. శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, జానపద నృత్యంలో విద్యార్థులు పాల్గొని ప్రశంసలు పొందారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతి పొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు బి.శైలజ, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు గైడ్ ఉపాధ్యాయినిగా డాక్టర్ వి.పద్మ వ్యవహరించారు.

ప్రభుత్వ సేవలను నిర్ణీత గడువులోనే ప్రజలకు అందాలి

గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డ్ సచివాలయ కార్యదర్శులు ప్రజలకు ప్రభుత్వ సేవలను నిర్ణీత గడువులో అందించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ కమిషనర్ డి. శ్రీనివాసరావు సూచించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంగళవారం షాప్ ఎంప్లాయిస్ కాలనీలోని 3వ, 5వ వార్డ్ సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత సచివాలయ కార్యదర్శుల హాజరు రిజిస్టర్లు, మూవ్మెంట్ రిజిస్టర్లను తనిఖీ చేసి, మాట్లాడుతూ కార్యదర్శులు ప్రజల సమస్యల పరిష్కారంలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, ప్రతి కార్యదర్శి తమ విభాగం ద్వారా మెరుగైన సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులకు సమయానుకూలంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.

రెవిన్యూ శాఖ పైనే భారీగా వచ్చిన అర్జీలు

– ఎమ్మెల్యే యరపతినేని

మాచవరం, మేజర్ న్యూస్ :

మాచవరం మండలంలోని అన్ని గ్రామాల నుండి ఎక్కువ శాతం రెవిన్యూ వ్యవస్థలోని సమస్యలు ఎక్కువగా ఉన్నాయి అని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. వందల సంఖ్యలో భూకబ్జాలు పొలం వివరాలు ఆస్తి తగాదాలు ఒకరు స్థలం ఒకరు ఆక్రమించటం ఇలాంటి సమస్యల మీద ఎక్కువ సంఖ్యలో ఈ మండల స్థాయి సమావేశంలో ప్రజలు పెద్ద ఎత్తున గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ద్వారా తహసిల్దార్ నాగమల్లేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో లోపాలు త్వరలో సరి చేస్తామని అధికారులు ప్రజల సమస్యల పరిష్కరించే విధంగా వారికి తెలియజేస్తామన్నారు అలాగే ఎంపీడీవో అగ్రికల్చర్ ఆర్డబ్ల్యూఎస్ హౌసింగ్ పంచాయతీరాజ్ సచివాలయం వ్యవస్థలపై కూడా పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అందజేశారు కార్యక్రమంలో తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు విఆర్వోలు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

17న స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి

గుంటూరు, మేజర్ న్యూస్ : జిల్లాలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంను ఈ నెల 17వ తేదీన కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్అన్సారియా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 17వ తేదీ ఉదయం 11 గంటలకు గుంటూరు సర్వజన ఆసుపత్రిలో ప్రారంభిస్తారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు సాగుతుందన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 301 వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య, అవగాహన శిబిరాలలో రక్త హీనత, క్షయ గుర్తింపు పరీక్షలు, బిపి, మధుమేహం, క్యాన్సర్ వంటి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలని గ్రామాలలో సంతకాల సేకరణ, వినతి పత్రాలు అందజేసిన సిపిఎం పార్టీ నాయకులు

ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ : పెదనందిపాడు మండలంలోని వివిధ గ్రామాలలో నెలకొని ఉన్న స్థానిక సమస్యలు పరిష్కరించాలని సి.పి.ఎం .పార్టీ పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు ప్రభుత్వ అధికారులను కోరారు. మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నాగులపాడు, పెదనందిపాడు, వరగాని గ్రామాలలో సమస్యలపై ప్రజలతో మాట్లాడుతూ, సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాలలో మురుగు నీటి సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. నాగులపాడు, వరగాని, పెదనందిపాడు గ్రామాలలో వాడుక నీటి సమస్య సమస్య తీవ్రంగా ఉందన్నారు. నీరు మురుగు వాసన వస్తున్నాయి అన్నారు. ఇళ్ల స్థలాలు , రేషన్ కార్డులు,ఆరోగ్య శ్రీ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని కోరారు. రోడ్లు సమస్యలు అన్ని గ్రామాలలో ఉన్నాయని అన్నారు. నాగుల పాడు చెంచుల కాలనీలో మంచినీటి సమస్య ఉన్నదని, పరిష్కారం కోసం మంచి నీటి ట్యాంకు నిర్మిస్తామని సుదీర్ఘకాలంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు హామీ ఇస్తున్నారు తప్ప ఇప్పటివరకు ట్యాంక్ నిర్మించలేదని

అన్నారు. నాగులపాడు గ్రామంలో చెరువు పాడైపోయి నీరు దుర్వాసన వస్తుందని గ్రామస్తులు తెలిపారన్నారు. వరగాని ఎస్సీలకు స్మశానవాటిక సమస్య ఉన్నదని, వారికి మరొక ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. పెదనందిపాడులోని నల్లమడ వాగు మీద నివసిస్తున్న ఎస్టీలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. గ్రామంలోని 1,2 వ వార్డులలో వర్షాలకు రోడ్డుమీద నీరు నిలుస్తుందని డ్రైనేజీలు బాగు చేయాలని కోరారు. సామాజిక పెన్షన్లు అర్హులైన కొత్తవారికి మంజూరు కావడం లేదని, ప్రభుత్వం వెంటనే సైట్లు ఓపెన్ చేయాలని కోరారు .పొగాకు రైతులు పొగాకు కొనుగోలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతుల వద్ద ఉన్నటువంటి పొగాకును పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు ఎరువులు అవసరం మేరకు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే రైతులకు ఎరువులు యూరియా, డి.ఏ.పి లు అందించాలని కోరారు.సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని గుంటూరు ఛానల్ పూడిగింపుకు వెంటనే నిధులు కేటాయించి ,పనులు ప్రారంభించాలని కోరారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకులలో పంట రుణాలు మంజూరు చేసేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సంతకాల సేకరణ అనంతరం నాగులపాడు, పెదనందిపాడు, వరగాని సచివాలయాలలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, పోపూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు ప్రాంతంపై చెరగని సంతకం కోడెల ప్రస్థానం

వినుకొండ మేజర్ న్యూస్ :

కోడెల కాంస్య విగ్రహావిష్కరణలో ఎంపీ లావు, చీఫ్ విప్ జీవీ, వినుకొండలో ఘనంగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు కాంస్య విగ్రహావిష్కరణ పల్నాడు ప్రాంతంపై చెరగని సంతకంగా కోడెలం ప్రస్థానమని కొనియాడారు ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు. రూపాయికే వైద్యం చేసిన పేదల డాక్టర్‌గా, రాజకీయాల్లో తిరుగులేని పల్నాటి పులిగా ఆయన ప్రయాణం అనితర సాధ్యమ ంటూ ఘన నివాళులు అర్పించారు. వినుకొండ నరసరావుపేట రోడ్డులోని ఎన్నెస్పీ మైదానం వద్ద ఏర్పాటు చేసిన మాజీ సభాపతి కోడెల శివప్రసాదరావు వర్ధంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ షరీఫ్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడెల శివరామ్ తో కలిసి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో వివిధ శాఖల బాధ్యతలు, స్పీకర్‌గా కూడా పనిచేసిన కోడెల ఏ పదవి ఇచ్చినా ఆ పదవికే వన్నె తెచ్చారన్నారు. రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యం ఇచ్చారని, అను నిత్యం అభివృద్ధి కోసం ఆలోచించేవారని అన్నారు. చంద్రబాబు యువపారిశ్రామిక వేత్తలు రాజకీయాల్లోకి రావాలన్న ఆ పిలుపు మేరకు తెలుగుదేశంలో అడుగు పెట్టిన తనకు తొలినాళ్లలో గురువుగా అనేక సలహాలు ఇచ్చారని తెలిపారు. అలానే పల్నాడు, ఉమ్మడి గుంటూరు జిల్లాను అభివృద్ధిలో ముందు నిలిపారని, తాగునీటి పథకం, కోటప్పకొండ త్రికూటేశ్వర దేవాలయం, కోడెల స్టేడియం సహా చరిత్రలో నిలిచిపోయే ఎన్నో పనులు చేశారన్నారు. పల్నాడు పులిగా ఏదైనా ధైర్యంగా ముక్కుసూటిగామాట్లాడే వారన్నారు. నవ్యాంధ్ర ప్రదేశ్‌లో చంద్రబాబు చేట్టిన స్వచ్ఛంధ్రప్రదేశ్‌లో సత్తనపల్లిని అగ్రస్థానంలో నిలిపారని, మరుగుదొడ్ల నిర్మాణంలో నియోజక వర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. అలానే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాట సింహంగా నిలిచారని, వైకాపా వేధింపులకు ఎదురొడ్డి పోరాడారన్నారు. ఆ క్రమంలోనే వైకాపా దుర్మార్గపు పాలనలో తప్పుడు కేసులు పెట్టి బలవన్మరణానికి కారణమయ్యారని, ప్రతిగా ప్రజలు వైకాపాను చిత్తుగా ఓడించి కోడెల ఆత్మకు శాంతి కలిగేలా చేశారన్నారు. అనంతరం నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కోడెల పేద ప్రజల పెన్నిధిగా, అభివృద్ధికి చిరునామాగా నిలిచారన్నారు. అత్యంత క్లిష్టమైన నరసరావు పేటను ఎంచుకొని ఆ గడ్డమీద గెలిచి తన పోరాటం పటిమని నిరూపించారని, ప్రజా పోరాటాలు, కోడెల కవలల్లా అనిపించే వారని కొనియాడారు. వారి స్ఫూర్తితోనే నడుచుకుంటూ అభివృద్ధికి పెద్ద పేట వేస్తున్నామని తెలిపారు. వరికెపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల కేంద్రమంత్రి గారు ఆమోదం తెలిపిన వినుకొండ నుంచి గుంటూరు వరకు జాతీయ రహదారి పూర్తి, ప్రతి ఇంటికి నీటిని అందించే విధంగా కృషి చేస్తున్నామని ప్రకటించారు.

పేదల గుండెల్లో చెరగని ముద్ర కోడెల

– మాజీ శాసనసభ స్పీకర్ కోడెల వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు మేజర్ న్యూస్:

పల్నాడు ప్రాంతంలో పేద ప్రజలకు మనసుతో వైద్యం చేయడమే కాకుండా రాజకీయాల్లో ఆత్మీయ సేవలందించి పల్నాటి పులిగా గుర్తింపు పొందిన నాయకులు దివంగత మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం కోడెల శివప్రసాద్ వర్ధంతి సందర్భంగా స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యేనసీర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. మాజీ మంత్రి కోడెల శివప్రసాద్ అంటే కేవలం రాజకీయ నేత మాత్రమే కాదని, అన్ని వర్గాలకు ఆదర్శప్రాయులని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి స్వర్గీయ నందమూరి తారక రామారావు అడుగు జాడల్లో గొప్ప నాయకులుగా ఎదిగారని తెలిపారు. పల్నాడు ప్రాంత అభివృద్ధిలో కోడెల మార్క్ఇప్పటికీ కనిపిస్తుందని చెప్పారు. ఫ్యాక్షనిజాన్ని పెంచి పోషిస్తోన్న సమయంలో వైద్య రంగం నుంచి రాజకీయాల వైపు వచ్చిన కోడెల ఆ ప్రాంతంలో శాంతి నెలకొల్పేందుకు తీవ్రంగా కృషి చేశారని అన్నారు. నేటితరం తమలాంటి రాజకీయ నాయకులకు కోడెల మార్గం అనుసరణీయమని, ఆయన జీవితం ఒక పాఠమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొంపల్లి మాలకొండయ్య, మహమ్మద్ హఫీజ్, పటాన్ జమీర్, చల్లా

ఆంజనేయ ప్రసాద్, కోటా పిచ్చిరెడ్డి, సయ్యద్ అన్వర్, పోతురాజు చంద్రశేఖర్,కొనకళ్ళ సత్యం, ఎస్ఎం నిజాముద్దీన్, తిరువలూరి పద్మావతి, సూర్రే శ్రీనివాస్, చిలక వెంకటేశ్వరరావు, పఠాన్ జాబి, సయ్యద్ ఉస్మాన్, ముకుందరావు, జానీ భాష, పోల సుబ్రహ్మణ్యం, నూర్, అచ్చి కిరణ్, పొందూరి నాగేశ్వరరావు, కలాం, బాబు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు

నానో యూరియా వలన చాలా ఉపయోగాలు ఉన్నాయి

ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ : నానో యూరియా వలన చాలా ఉపయోగాలు ఉన్నాయని, వాటిని ప్రతి రైతు వినియోగించుకోవాలని ఏడిఏ సునీత అన్నారు. మంగళవారం వట్టి చెరుకూరు మండల పరిధిలోని చమళ్లమూడి గ్రామం లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడిఏ సునీత మాట్లాడుతూ ప్రతి రైతు పంటలు నమోదు చేసుకుంటే కలిగే ప్రయోజనాలు గురుంచి రైతులకు వివరించారు. శిక్షణ ఇవ్వడం జరిగింది. మినుములు మరియు మిర్చి పంటల సాగు లో మెలకువలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ వో రాజవంశీ గారు రైతులకు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారిసీ హెచ్ సునీత, వీఏఏ శిరీషమరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు పోలీసులు ఉన్న గ్రూపుల సైతం హాక్ చేస్తున్న స్కామర్స్ 8309700635 నెంబర్

వినుకొండ మేజర్ న్యూస్ : గత రెండు రోజులు క్రితం ఒక విలేకరుల గ్రూపులో ఒక స్కామర్ 8309700635 ఈ నెంబర్ నుంచి హర్ష సాయి అనే ఒక వ్యక్తి ఫోటో పెట్టి ఇతను చాలా మంచి పనులు చేస్తున్నాడు ఇతనికి సంబంధించి నేను ఒక స్కానర్ పెడతాను ఆ స్కానర్ హర్ష సాయిది ఆ స్కానర్ కి కనుక మీరు 2000 రూపాయలు కొడితే హర్ష సాయి మీకు రిటర్న్ గా 18000 రూపాయలు కొడతారు అని చెప్పి ఆ విధంగా ఫేక్ స్క్రీన్ షాట్ ను పెడుతూ 18000 కొట్టారు అని చెప్పి కొత్త కొత్త పేర్లతో ఆ స్క్రీన్ షాట్ పైన నెంబర్ దగ్గర నెంబర్ కనబడకుండా చివరి రెండు అంకెలు డన్ సింబల్ పెట్టి ప్రజలను మోసం చేయటమే కాకుండా గ్రూపులో ఉన్న సైతం హ్యాక్ చేసి గ్రూపుల వాళ్ళందరినీ ఇలాంటి వాటికి ప్రోలోబల్ పెడుతున్నారు ఇప్పటికైనా సైబర్ పోలీసు వాళ్లు వీళ్ళ పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ యార్డ్ చైర్మన్

వినుకొండ మేజర్ న్యూస్ : వినుకొండ మార్కెట్ కమిటీ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ నూజెండ్ల మండల కేంద్రంలో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనిన వినుకొండ యార్డు కమిటీ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఇంటి ముందుకు రేషన్ బండి బజార్లో పెట్టిన గాని గంటల తరబడి ఎదురు చూసే వాళ్ళని కానీ ఈనాడు రేషన్ డీలర్ల వద్దకు కార్డు దారులు గంటల తరబడి ఎదురు చూడకుండా వెళ్లిన వెంటనే రేషన్ తెచ్చుకుంటున్నారని ఈ సందర్భంగా అన్నారు. అలాగే ప్రస్తుతం ఈ స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ సరుకులను జిల్లాలోని ఏ ప్రాంతంలో నైనా రేషన్ తీసుకోవచ్చని తెలియజేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎంతో సమర్థవంతంగా ప్రతి ఒక్కరికి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నార న్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు ఒక వైపు సంక్షేమం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ 6 పథకాలను అవే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలను చేస్తున్న ప్రభ

పిపిపి విధానంలో వైద్య కళాశాలలు వద్దు

– డా. ఆలా వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనరషిప్ విధానం ద్వారా ప్రైవేట్ వైద్య కళాశాలలుగా మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రముఖ వైద్యులు, ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 16 వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో పేదలకు వైద్య విద్య దూరమవాల్సిందేనా? అనే అంశంపై జరిగిన చర్చా గోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. డాఎఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ స్వర్గీయ ఎన్టీ రామారావు నాడు ప్రైవేట్ రంగంలో ఉన్న సిద్ధార్థ మెడికల్ కాలేజీని ప్రభుత్వ రంగంలోకి తీసుకొస్తే, నేడు నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రంగంలో ప్రకటించిన 10 వైద్య కళాశాలలను పి పి పి పేరుతో ఆర్థిక లబ్ధి, రాజకీయ లబ్ధి కోసం అనుమాయులకు కేటాయించాలని భావించటం క్షంతవ్యం కాదన్నారు. ప్రైవేట్ యాజమాన్యంలో నడుస్తున్న మెడికల్ కళాశాలల్లో, అనుబంధంగా ఉన్న ఆసుపత్రులల్లో రిజర్వేషన్లు అమలు కావని నీట్ పరీక్షలో 16 శాతం మార్కులు పొందిన వారికి కూడా లక్షలాది రూపాయల డొనేషన్ తో ఎంబిబిఎస్ సీట్లు కేటాయిస్తూ ప్రతిభకు పాతరేస్తున్నారని తెలిపారు. 95 శాతం ప్రజలకు 50 శాతం మెడికల్ సీట్లు కేటాయిస్తే కేవలం 5 శాతం ధనికులకు మిగిలిన 50 శాతం ఎంబిబిఎస్ సీట్లు కేటాయిస్తూ ప్రతిభ గల పేద విద్యార్థులను శాశ్వతంగా వైద్య విద్యకు దూరం చేస్తున్నారన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో స్టైఫెండ్స్ ఇవ్వడం లేదని సి కేటగిరిలో 2 నుండి 3 కోట్లకు ఎంబిబిఎస్ సీట్లు అమ్ముకుంటున్నారని తెలిపారు. మాజీ శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రతి లోక్ సభకు ఒక వైద్య కళాశాల ఉండాలనే విధాన నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ కు 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుమతిస్తూ 60 శాతం నిధులను కేటాయిస్తే, నేడు చంద్రబాబు నాయుడు సరైన నిధులు లేవనే నెపంతో 10 మెడికల్ కళాశాలలను పి పి పి విధానానికి మార్చడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలోని విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమ కార్యాచరణను చేపట్టాలని, రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న 15 సంవత్సరాలలో ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాలను కూడా స్థాపించలేదని, ప్రైవేట్ పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఓవైపు యోగాంధ్ర లాంటి ఈవెంట్స్ లకు వందలాది కోట్లు ఖర్చు చేస్తూ మరోవైపు పేదలకు వైద్యవిద్య, వైద్యం అందించే వైద్య కళాశాలలకు, అనుబంధ ఆసుపత్రులకు నిధులు లేవని ముఖ్యమంత్రి చెప్పడం బాధాకరమన్నారు. 10 మెడికల్ కళాశాలల్లో 500 ఎకరాల ప్రభుత్వ భూమి, నిర్మాణాలతో కలిపి 2 వేల కోట్లు ఆస్తులను ప్రైవేట్ రంగానికి కట్ట పెట్టాలని చూస్తున్నారన్నారు. సేవారంగంలో ఉండాల్సిన విద్యవైద్య రంగాలను వ్యాపారమయంగా చేయడం దురదృష్టకరమన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయ విభాగ విశ్రాంత ప్రొఫెసర్ ఎన్.రంగయ్య ప్రసంగిస్తూ ప్రభుత్వాలు విద్య, వైద్యరంగంపై ఖర్చు చేయకుండా బుల్లెట్ రైళ్లు, ఐకానిక్ భవనాలు, మెట్రో ప్రాజెక్టుల పై ఖర్చు చేయటం భావ్యమా అని ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా ఉద్యమించి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకోవాలన్నారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి ఏ ఆర్ సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ గతంలో కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు నకిలీ అనుమతులతో విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న సంగతిని గుర్తు చేశారు. సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి ప్రసంగిస్తూ ప్రైవేట్ వైద్య విద్య ఖరీదుగా మారడంతో వైద్యులలో వ్యాపార ధోరణి పెరగడం ద్వారా రోగులు ఆర్థికంగా చితికిపోతూ అప్పుల పాలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్.ఆర్.సి.పి. విద్యార్థి విభాగ రాష్ట్ర అధ్యక్షులు పి. చైతన్య, ఐఏఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాజరజీ, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి యశ్వంత్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, బిసి జన మహా సభ కన్వీనర్ ఉగ్గం సాంబశివరావు తదితరులు ప్రసంగించారు. ప్రముఖ వైద్యులు ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఉద్యమ కార్యాచరణ కమిటీని త్వరలో ప్రకటిస్తామని అందులో విద్యార్థి యువజన సంఘాలు ప్రజా సంఘాలు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు మేధావులు స్వచ్ఛంద సంస్థల నేతలు ఉంటారని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రకటించారు.

జిల్లా సాయి ఎస్ సి సెల్ కార్యనిర్వాహక సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నరసరావుపేట మేజర్ న్యూస్ : మంగళవారం ఎస్సీ సామాజిక వర్గానికి సంబంధించి అన్ని నియోజకవర్గాల్లో కూడా మంగళవారం అధ్యక్షులు అందరినీ నియమించుకున్నము మండల అధ్యక్షులు అందర్నీ ప్రకటించుకున్నాము ఒకటే మీ అందరూ కూడా నాలుగు మూల స్తంభాలు ఉంటే మొట్టమొదటి మూల స్తంభం ఎస్సీ సామాజిక వర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ కూడా చెక్కుచెదరని ఈ రాష్ట్రంలో ప్రజాదరణ పొందిందంటే దానికి కారణం ఎస్సీ సామాజిక వర్గం సోదరా సోదరులారా. మరి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అన్యాయంగా కేసులు పెడతా ఉన్నారు. అక్రమంగా అరెస్టులు చేస్తూ ఉన్నారు. అయినా సరే భయపడకుండా మేమున్నాము వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనే ఒక ఫోన్ కాల్ చేస్తే రోడ్డు మీదకు వచ్చి నిలబడి వ్యక్తులు మీరందరని ఈరోజు గుర్తు చేస్తూ ఉన్నాను. కచ్చితంగా మరి రాజశేఖర్ రెడ్డి నిన్న మంచి పనులు చేశారు. జగన్మోహన్ రెడ్డి మీద ప్రేమ అభిమానాలు ఉన్నాయి మంగళవారం అవన్నీ ఉన్నా సరే ప్రభుత్వం నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉన్నాం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వీరు యాక్టివ్గా పని చేస్తున్నాడు అంటే వాడిని ఎలా లోపల పెట్టాలి వాడి మీద ఎలా కేసు పెట్టి విరికించాలి ఎలా జైలుకు పంపించాలి అనే ఆలోచనలో ఉన్నారు ఈ కూటమి ప్రభుత్వం వారు. మా నియోజకవర్గంలో రావిపాడు గ్రామంలో ఎస్సీ సోదరులు రాంకోటేశ్వరావు మరియు సుబ్బారావు అని ఇద్దరు వ్యక్తులను ఎప్పుడో 2022 లో జరిగిన కేసుకి దాదాపు 45 రోజులు జైల్లో ఉండి వాళ్ళ బయట తీసుకురావడం జరిగింది. నేను ఒకటే చెప్తున్నాను భయపడకుండా ఎవరైతే పోరాటం చేస్తారో వాళ్లే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో రేపు ముందుండే కార్యక్రమం చేస్తాం. ఎవరు కూడా భయపడాల్సిన అవసరం లేదు. ఈ కూటమి ప్రభుత్వానికి సంవత్సరానికి అర్థం అయిపోయింది తెలుగుదేశం పార్టీ వాళ్లకి వాళ్లు పోలీసులు అడ్డం పెట్టుకొని చేస్తూ ఉన్నారు. ఆల్రెడీ తెలుగుదేశం పార్టీ వారికి బయో స్టార్ట్ అయింది. ఎందుకంటే ఈ రాష్ట్రంలో మళ్లీ జగన్మోహన్ రెడ్డి గెలవడం ఖాయం అని. తెలుగుదేశం పార్టీ ప్రజలందరికీ అర్థమయిపోయింది. ప్రజలందరూ అర్థం చేసుకున్నారు చంద్రబాబు చెప్పే మాటలకు మోసపోయావని సూపర్ సిక్స్ సూపర్ సెవెన్ పథకాలను నమ్మి మోసపోయాం అని. జగన్మోహన్ రెడ్డి ని గెలిపించుకోకుండా పోగొట్టుకున్నామని ప్రజలందరూ బాధపడుతున్నారు. పాలిచ్చే గేదని పోగొట్టుకొని దున్నపోతును తెచ్చి ఇంట్లో పెట్టుకున్నామని. ఈ రాష్ట్రంలో అది పరిస్థితి ఇలాంటి పరిస్థితుల్లో కచ్చితంగా మళ్లి జగన్మోహన్ రెడ్డి విజయం సాధించటం ఖాయం అని వర్గాల వారు కూడా మూడున్నర సంవత్సరాలు ఉంది కాబట్టి అన్ని వర్గాల వారు కూడా ఓపిగ్గా చూడాలి అని చెప్పి మీ అందరికీ తెలియజేయడమైనది. ఆయన కూడా నిత్యం పార్టీ శ్రేయస్ కోసం పార్టీ యొక్క పిలుపు కోసం ఆయన సెంట్రల్ ఆఫీస్ లోనే మంగళవారం అన్ని కార్యక్రమాలు చేస్తున్నారు. ఎందుకంటే ఒకటే చెప్తా ఉన్నాను కచ్చితంగా ఎస్సీ సామాజిక వర్గానికి ప్రథమ స్థానం ప్రథమ పీఠం వేస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అని చెప్పి. కచ్చితంగా మీరందరూ కూడా పార్టీ కోసం నిలబడి పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని అందరికీ ఈ సభ ముఖంగా తెలియజేయడమైన. ఈ జిల్లాస్థాయి ఎస్సీ సెల్ కార్యనిర్వాహక సమావేశంలో వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విధేయతకు అరుదైన గౌరవం

– విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా మోతడక వీరాచారి

వినుకొండ మేజర్ న్యూస్ :

విధేయత.. పార్టీ పట్ల నిబద్ధతగా పనిచేసిన నేతకు కూటమి ప్రభుత్వంలో అరుదైన గౌరవం లభించింది. వినుకొండకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు , ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సిఫారసు మేరకు విశ్వ బ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర డైరెక్టర్ గా నియమించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇంజనీర్లు సమాజానికి సాంకేతిక సాయం అందించాలి : సంజనా సిన్హా

పెదకాకాని మేజర్ న్యూస్ : సాంకేతికత దైనందిన జీవనంలో భాగం అయినందున ఇంజనీర్లు సమాజానికి అవసరమైన సాంకేతిక సాయం అందించాలని తెనాలి సబ్ కలెక్టర్ వి. సంజనా సిన్హా ఐ.ఏ.ఎస్ అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీ నందు అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరి (ఎ.సి.ఎమ్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16, 17 తారీఖులలో రెండురోజుల పాటు నిర్వహించనున్న స్పర్ధ-2కే25 సాంకేతిక సదస్సుకు ముఖ్యఅతిధిగా హాజరైన సంజనా సిన్హా ఈ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సంజనా సిన్హా మాట్లాడుతూ చదువు సమాజానికి ఉపయోగాపడేలా ఉండాలని, సాంకేతికతతో సమాజంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సాంకేతికసహకారంతో యాప్లరూపంలో పరిష్కారాలు చూపుతుందనీ వాటి పై అవగాహన కల్పించవలసిన బాధ్యత సాంకేతిక విద్యార్థులపై ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన వ్యవస్థాపకుల అవసరం ఉందని ఇంజనీర్లు వ్యవస్థాపకులుగా మారాలని సూచించారు. విద్యార్థులు స్పర్ధ వంటి సాంకేతిక సదస్సులో పాల్గొనడం ద్వారా పోటీతత్వం పెరుగుతుందని అన్నారు. ఇంజనీరింగ్ పట్టభద్రురాలైన తాను ఒటమి నుండి చాలా నేర్చుకున్నానని. విద్యార్థులు ఒటమి చెందినప్పుడు నిరాశ చెందక ఆలోచన చేసి విజయం వైపు సాగాలని అన్నారు. అనంతరం ఏ.సి.ఎమ్ క్రానికల్ 2024 పుస్తకాన్ని సంజనా సిన్హా ఆవిష్కరించారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా 36 కళాశాలల నుండి 210 గ్రూపులు, 1470 మంది విద్యార్థులు పాల్గొనను

న్నారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమములో గేమ్ ఆఫ్ కోడ్, అల్లా ఆరీనా, ట్రెజర్ ట్రూపర్స్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమములో వివిఐటియు రిజిస్ట్రార్ డా? వై. మల్లికార్జునరెడ్డి, సి.ఎన్. ఈ విభాగాధిపతి డా?. వి.రామచంద్రన్, ఐ.టి విభాగాధిపతి డాఎఎ ఎ. కళావతి, సి.ఎస్. ఎమ్ విభాగాధిపతి డా? కె. సురేష్ బాబు, ప్రోగ్రామ్ కోర్డినేటర్ డాఎఎ బి. సాయిజ్యోతి మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

యంగ్ స్టార్స్
హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ కి జాతీయ సేవ రత్న పురస్కారం

వినుకొండ మేజర్ న్యూస్ : అంతర్జాతీయ గుర్తింపు పొందిన మదర్ సర్వీస్ సొసైటీ వారు మూడవ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడ అక్కినేని కళకేంద్రం నందు నిర్వహించిన కార్యక్రమం లో భాగంగా వేరు వేరు రాష్ట్రాలలో స్వచ్ఛందంగా సేవ చేయుచున్నవారికి అవార్డ్స్ అందచేయటం జరిగినది. కార్యక్రమం లో భాగంగా వినుకొండ కి చెందిన యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ కు వారు గత కొన్ని సంవత్సరాలుగా చేయుచున్న సేవలను గుర్తించి వారిని ఘనంగా సత్కరించి వారికి జాతీయ సేవ రత్న అవార్డు అందచేశారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన యాక్టర్ 30ఇయర్స్ ఇండస్ట్రీ పృద్వి అతి చిన్న వయసులో వీరు చేస్తున్న సేవలని యువత ఆదర్శంగా తీసుకోని యువత అందరూ సేవ దృక్పధం కలిగి ఉండాలని అన్నారు, అనంతరం సంస్థ వ్యవస్థాపకులు మల్లది ప్రసాద్ రావు మాట్లాడుతూ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ వారు గత కొన్ని సంవత్సరములుగా విద్యార్థులకు విద్యకు అవసరమైన ఎగ్జామ్ కిట్లు, పేద పిల్లలకు చేయూత, బలహీన వర్గాల వారికి నిత్యవసర సరుకుల పంపిణీ, ఇలా పలు కార్యక్రమాలు చేస్తూ వున్నారని ఇలాంటి యువ తను ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని, వారి సేవలను మేము గుర్తించి వారికి అవార్డు అందించినందుకు గాను మా సంస్థ సభ్యులందరూ చాలా ఆనందంగా ఉందని ఏం ప్రసాద్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ని కొనియాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ మాట్లాడుతూ మా ఫౌండేషన్ యొక్క సేవలను గుర్తించి మాకు జాతీయ సేవ రత్న అవార్డు అందించినందుకు గాను వారి సంస్థ సభ్యులకు మేము కృతజ్ఞతలు తెలుపు

కుంటునమని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పృద్వి తనయి యాక్ట్రెస్ (శ్రీలు, యాక్ట్రెస్ రజిత శాండే, రిపబ్లిక్ అని పార్టీ జాతీయ అధ్యక్షులు పేరం నాగేశ్వరరావు గౌడ్,సినీ నిర్మాతలు జిలీల్, అలీ ఖాన్,రిపబ్లికన్ పార్టీ సౌత్ ఇండియా అధ్యక్షులు అయిరేని శ్రావణ కుమార్,తెలంగాణసినిమా యూనియన్ పి ఆర్ ఓ గోంగూర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాలలను అణిచివేస్తే
ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదు : గోళ్ళ అరుణ్ కుమార్

గుంటూరు మేజర్ న్యూస్ : పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం పట్టణ కేంద్రంలోని హనుమాన్ నగర్ లో మాల మహానాడు నియోజకవర్గ కార్యాలయం ప్రారంభోత్సవం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా ప్రారంభోత్సవానికి జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్ పాల్ పాల్గొని ప్రారంభించారు ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి అధ్యక్షులుగా మాల మహానాడు కోశాధికారి పెనుమాల రమేష్ అధ్యక్షతవహించగా వక్తలు మాట్లాడుతూ నియోజకవర్గంలో మాలలకు ఏ సమస్య వచ్చిన నియోజకవర్గ కమిటీతో పాటు జిల్లా రాష్ట్ర జాతీయ కమిటీ అండదండలుగా ఉంటుందని నియోజకవర్గం లోని మాలలందరినీ ఏకం చేస్తూ ఎస్సీ వర్గీకరణ పేరిట మాలలకు జరుగుతున్న అన్యాయంపై వివరిస్తూ వారిని చైతన్య పరుస్తూ రాష్ట్రంలో కైకలూరు లోని దాన గూడెం లాంటి గ్రామాలలో మాలలపై జరుగుతున్న దాడులను అరికట్టే దిశగా, మేమున్నాం అనే భరోసా ఇచ్చే దిశగా మాల మహానాడు నాయకులు మాల సైన్యం పనిచేయాలని రానున్న అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ పై మరోసారి చర్చ జరపాలని తెచ్చిన ఆర్డినెన్స్ రద్దు చేయాలని రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని ఎస్సీ ఎస్టీ చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్చే విధంగా ప్రజాప్రతినిధులు మాట్లాడాలని నాయకులు కోరుతూ గత ప్రభుత్వంలో దళిత గిరిజనులకు సంబంధించిన పథకాలను ఏ విధంగా నిర్వీర్య పరిచారో తదుపరి ఎన్నికలలో ప్రజలు ఏ విధంగా బుద్ధి చెప్పారు ఆ పరిస్థితి నేటి కూటమి ప్రభుత్వం తెచ్చుకోవద్దని పాలకులను హెచ్చరిస్తూ మాలలకు ఉన్న జనాభా నిష్పత్తి ప్రకారం మూడు మంత్రి పదవులు ఇవ్వాలని కేవలం ఒక మంత్రి పదవితో సరిపెట్టి ఎక్కడ మాలల అన్యాయం జరిగిన మాట్లాడలేని పరిస్థితిలోకి మాల ప్రజాప్రతినిధులను తీసుకొచ్చారని ఇప్పటికైనా రాష్ట్రంలో ఉన్న మెజారిటీ ప్రజలు కలిసిన మాలను గుర్తించి ప్రభుత్వం వారికి తగిన అవకాశాలు కల్పించకపోతే కచ్చితంగా రానున్న రోజుల్లో మాలల పంతం వర్గీకరణ వాదుల అంతం అనే నినాదంతో పెద్ద పోరాటానికి పిలుపునిస్తావని మాట్లాడారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనపర్తి లలిత్ బాబు, అర్పిఐ పార్టీ జిల్లా అధ్యక్షులు వంజా ముత్తయ్య,నియోజకవర్గ అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు రాయిని చిన్న, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షులు బేతం దేవానంద్ జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రు విజయ్, జిల్లా వర్కింగ్ అధ్యక్షులు గుడిపూడి ఏసురత్నం, నియోజక

వర్గం గౌరవ అధ్యక్షులు పగిడిపల్లి ఇశ్రాయేలు, నియోజకవర్గం ఉపాధ్యక్షులు కొమ్మతోటి సుధాకర్, ప్రధాన కార్యదర్శి బొందలపాటి నాగేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి దార్ల ఎర్రయ్య, గౌరవ సలహాదారులు కొమ్మ తోటి కృపయ్య ఈపూరు మండల అధ్యక్షులు పెనుమాల వెంకట్రావు పట్టణ ఉపాధ్యక్షులు కొట్టే మనోజ్ ధార పాపారావు ఫైయర్డ అనిల్ ప్రధాన కార్యదర్శి జ్యోతి మల్లికార్జున్ రావు కార్యదర్శి అంబడిపూడి శ్రీనివాసులు బొల్లాపల్లి మండల యూత్ అధ్యక్షులు కీర్తిపాటి గోవిందరాజులు వినుకొండ మండల అధ్యక్షులు పిడతలని అనిల్ ఉపాధ్యక్షులు చలమాల రామాంజనేయులు ప్రధాన కార్యదర్శి పిడతల రాజా నూజెండ్ల మండల అధ్యక్షులు అందుకూరి గురుమూర్తి ఉపాధ్యక్షులు మాలపాటి భాగ్యరాజు ప్రధాన కార్యదర్శి మాలపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.